ప్రజాశక్తి

మంగళవారం 11 జూన్ 2024

5

పార్వతీపురం మన్యం



ఆర్‌టిఓగా అదనపు బాధ్యతలు స్వీకరించిన శశికుమార్

రవాణా శాఖ జిల్లా అధికారిగా ఎం.శశికుమార్ ఎఫ్ఎసిగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను మర్యాద పూర్వకం కలిశారు. అంకిత భావంతో విధి నిర్వహణను నిర్వర్తించాలని నిశాంత్ కుమార్ సూచించారు.

-ప్రజాశక్తి, పార్వతీపురంటౌన్



కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న ఆర్‌టిఓ



నారుమళ్లను సిద్ధం చేస్తున్న రైతులు

రుతుపవనాల తాకిడితో అన్నదాతలో కలివిడి కనిపిస్తోంది. ఖరీఫ్ పంటల సాగుకు సన్నద్ధమౌతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నేల కాస్త చల్లబడింది. దీంతో ప్రస్తుతం అక్కడక్కడా వేరుశనగ విత్తనాలు నాటుతున్నారు. మరోవైపు వరి నారుపోతకు అనుగుణంగా దుక్కులు వేసి మడులను తయారు చేస్తున్నారు. మరొకటీ లేదా రెండు జల్లులు కురిస్తే నారుమడులు సిద్ధం చేసుకోవడానికి అన్ని ప్రాంతాల్లోనూ అనువుగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. సకాలంలోనే జల్లులు కురుస్తున్నప్పటికీ ఇంకా సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడం రైతులను కొంచె ఇబ్బంది పరుస్తోంది.

సాగుకు సన్నద్ధం

- వరినారు మళ్లు సిద్ధానికి దుక్కులు
- అందుబాటులోకి విత్తనాలు, ఎరువులు
- రుతుపవనాల తాకిడితో అన్నదాతలో మొలకెత్తిన ఆశలు
- రాయితీపై గిరిజన రైతులకు విత్తనాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం మన్యంజిల్లా పూర్తిగా వ్యవసాయాధారిత జిల్లా. మధ్యతరహా సాగునీటి వనరులు ఉన్నా, వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఎక్కువగా వర్షాధారంగానే ఖరీఫ్ పంటలు సాగవుతాయి. ఈ పంటలతోనే ఏడాదంతా బతుకీడాల్సివుంటుంది. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సీజన్ కోసం రైతాంగం ఏడాదంతా ఎదురు చూస్తుంటుంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో వరి సుమారు లక్షా 75వేల ఎకరాల్లో సాగుకు సిద్ధం కాగా, ఇందుకు అవసరమైన 26,416 క్వింటాళ్ల వరివిత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. అలాగే గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస, పాచిపెంట, సాలూరు, సీతంపేట మండలాల్లో గిరిశిఖర గ్రామాల్లో చిరు ధాన్యాల సాగును పెద్ద ఎత్తున చేపట్టేందుకు గాను, రైతులను కావాల్సిన దాదాపు 110 క్వింటాళ్ల చిరు ధాన్యాల విత్తనాలను 90శాతం రాయితీపై సరఫరా చేసేందుకు అధికారులు సిద్ధం చేశారు. అలాగే తొలకరిలో ఖరీఫ్ పంటకు ముందుగా సాగు చేసి పచ్చిరొట్ట పంటల విత్తనాలైన కట్టిజనుము 820-క్వింటాళ్లు, పిల్లిపెసర-63 క్వింటాళ్లు, జీలుగ-1488 క్వింటాళ్లు విత్తనాలు జిల్లాకు కేటాయించగా (మొత్తంగా 2371 క్వింటాళ్లు), ఇప్పటికే దాదాపు 1300 క్వింటాళ్ల విత్తనాలను రైతు భరోసా కేంద్రాలను తరలించారు. వీటితో పాటు కంది 197 క్వింటాళ్లు, అపరాలు 47 క్వింటాళ్లు, వేరుశనగ 206 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీకి సిద్ధం చేశారు.

ఇదిలా ఉండగా ఎరువులను కూడా అధికారులు సిద్ధం చేసి ఉంచారు. గతేడాది జిల్లాలో 41,191 టన్నుల ఎరువులు వినియోగం కాగా, ఈ ఏడాది 45,277 టన్నుల వినియోగాన్ని అధికారులు అంచనా వేశారు. రైతులకు ఎటువంటి ఎరువుల కొరత లేకుండా ముందుగానే యూరియా, డిఎపి, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులను సిద్ధంగా ఉంచారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

జిల్లాలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య పనులపైనా, సీజనల్ వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎఇలు, మెడికల్ ఆఫీసర్లతో కలెక్టర్ నిశాంత్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో సీజనల్ వ్యాధులు, మలేరియా స్ప్రేయింగ్, గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్, ఉపాధి హామీ - లేబర్ టర్న్ అవుట్, సగటు వేతనం, తాగునీటి సమస్యలు, జల్ జీవన్ మిషన్‌లో కొనసాగుతున్న పనులు, మ్యుటేషన్లపై తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య డ్రైవ్ ను నిర్వహించాలన్నారు. కాలువల్లో పూడిక తీత, దోమల లార్వా నివారణ పిచికారీ (ఏఎల్‌ఓ) కార్యకలాపాలు, తుప్పల తొలగింపుతో సహా బావులు, కుళాయిలు, బోరుల వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా వివిధ పనులు చేపట్టారు. కీటకాల నాశనానికి బ్లీచింగ్ చల్లారు. మలేరియా దోమల వ్యాప్తి నివారణకు స్ప్రేయింగ్ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని పేర్కొన్నారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, ఎంపిడిఒలు, జిల్లా మలేరియా అధికారి సమన్వయంతో పనిచేస్తూ సంబంధిత సిబ్బంది క్షేత్ర స్థాయిలో పలు కార్యక్రమాలు చేయాలన్నారు. జిల్లాలో మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రభలకుండా ఉండేందుకు దోమల నివారణ ఆవశ్యమని, అందుకు ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా ప్రతి ఇంటిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మ్యుటేషన్స్, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ల జాప్యంలో వేగవంతం చేయాలన్నారు. వర్షాలు రాకముందే ఉపాధి హామీ పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్‌లో కొనసాగుతున్న పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.విజయపార్వతి, డిఆర్‌డిఎ పిడి వై.సత్యంనాయుడు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, డిఎంఒ డాక్టర్ టి.జగన్ మోహనరావు, పీడీ డ్వామా కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ ఓ.ప్రభాకరరావు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

వ్యవసాయ అనుబంధ శాఖలతో సమీక్ష

వ్యవసాయ, ఉద్యాన, మత్స్య పశు సంర్ధకశాఖలతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో వ్యవసాయశాఖ శాఖకు సంబంధించి విత్తనాలు, ఎరువులు, వివిధ పంటల వివరాలు, ఉద్యానశాఖకు సంబంధించి జీడీ, అరటి తోటలకు సంబంధించి రైతులకు ఉన్న సమస్యలు, ఎరువుల వివరాలు , పశుసంవర్ధకశాఖకు సంబంధించి వాక్సిన్లు, సీజనల్ వ్యాధులు, హాస్పిటల్, సిబ్బంది పనితీరు వివరాలు, మత్స్యశాఖకు సంబందించి స్టాక్ పాయింట్ వివరాలు, ఇలా శాఖ లకు సంబందించి పలు అంశాలు పై ఆయన సమీక్షించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్‌పాల్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎస్.మన్మధరావు, ఎపిఎంఐపి అధికారి రాధాకృష్ణ, తదితరులు పాల్గున్నారు.

కమిషనర్‌పై జిల్లా కలెక్టర్ సీరియస్

సాలూరు: స్థానిక మున్సిపల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి పై సోమవారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది..కలెక్టర్ కార్యాలయం నుంచి మన్యం జిల్లా లోని ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన పారిశుధ్య నిర్వహణ, మలేరియా నివారణ చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ కాన్ఫరెన్స్‌కు కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి హాజరు కాలేదు.దీంతో ఆయన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. గతంలో ఎన్నికలకు సంబంధించిన ముఖ్యమైన సమావేశానికి కూడా ఆమె గైరుహాజరు కావడంతో కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆమెకు మెమో జారీ చేశారు. ఇప్పుడు వీడియో కాన్ఫరెన్స్‌కు గైర్హాజరు కావడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే ఈ విషయం తెలుసుకున్న కమిషనర్ ప్రసన్న వాణి జిల్లా కలెక్టర్ నిశాంత్‌ను కలిసి తన ఆరోగ్య సమస్యల్ని వివరించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది .అయితే కమిషనర్ ప్రసన్న వాణి ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడి కి వచ్చారు. ఆమె స్థాయికి ఈ మున్సిపాలిటీ కమిషనర్ చిన్న పోస్ట్ కావడంతో ఆమె అయిష్టంగానే ఇక్కడ బాధ్యత లు చేపట్టారు. గడచిన రెండు నెలలుగా ఆమె మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంపై కూడా తగిన శ్రద్ధ వహించకపోవడంతో పారిశుధ్య కార్మికులు సోమవారం నుంచి సమ్మెకు దిగారు.

జిఒ 117ను రద్దు చేయాలి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

కొత్తగా రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం జిఒ 117ను వెంటనే రద్దుచేసి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు కోరారు. సోమవారం స్థానిక ఎన్జీవో హోంలో జరిగిన యుటిఎఫ్ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిఒ 117 పేరిట గత ప్రభుత్వం విద్యారంగాన్ని నాశనం చేసిందని, అలాగే విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ అరాచకాలపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం జిల్లా అధ్యక్షులు తోట రమేష్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. అలాగే అక్షర యోధుడు ఈనాడు రామోజీరావు మృతికి సంతాపం ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.భాస్కరరావు, వి.జ్యోతి, రాజకుమారి, రాజామణి, కె.మురళితో పాటు అన్ని మండలాలకు చెందిన నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



లోకేష్‌ను కలిసిన కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి దంపతులు

లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తన కుటుంబ సభ్యులతో సోమవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల సమయంలో నియోజకవర్గంలోని నాయకుల పనితీరు, ఓటింగ్ సరళిని ఆయనకు వివరించినట్లు సమాచారం.

సంధ్యారాణికే ఛాన్స్?

ప్రజాశక్తి - మక్కువ

పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు తెలుగుదేశం పార్టీకి సంపూర్ణ విజయాన్ని తమ ఓటు ద్వారా అందించారు. అధిక శాతం గిరిజన జనాభా కలిగిన జిల్లా. గత ప్రభుత్వ హయాంలో ఈ జిల్లాలోని ఎమ్మెల్యేలకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదవిని చెరిసగం ఇచ్చినా, ఆశించిన రీతిలో అభివృద్ధి జరగలేదన్నదని ఈ ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ దఫా ప్రభుత్వం మారినప్పటికీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదవి ఈ జిల్లాలోని సాలూరు, కురుపాం, పాలకొండ గిరిజన ఎమ్మెల్యేలకు దక్కుతుందో లేదోనన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. గిరిశిఖర గ్రామాలు అభివృద్ధికి నోచుకోవాలంటే గిరిజన సంక్షేమ శాఖను తమ జిల్లాకు కట్టబెట్టి అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోయే చంద్రబాబు నాయుడు ముందడుగు వేయాలని ఈ ప్రాంత ప్రజలంతా కోరుతున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో టిడిపికి ఈ జిల్లాలోనే ముగ్గురు గిరిజన ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఇందులో సాలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మడి సంధ్యారాణి రాజకీయాల్లో మిగతా ఇద్దరికంటే సీనియర్. అంతేకాకుండా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాలో మహిళా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఓ విభాగంలో పనిచేసే అనుభవం కూడా ఉంది. 2019 టిడిపి ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీగా కూడా పనిచేశారు. ఈసారి జిల్లాలో గిరిజన ఎమ్మెల్యేలంతా మొదటిసారి శాసనసభలో అడుగుపెడుతున్న వారే కావడం విశేషం. ఈనెల 12న జరగబోయే ముఖ్యమంత్రి సహా క్యాబినెట్ ప్రమాణ స్వీకారంలో గిరిజన సంక్షేమ శాఖకు కూడా ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందని సర్వత్రా చర్చ జరుగుతుంది. ఈ నేపథ్యంలో సాలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే సంధ్యారాణికి మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశం కూడా లేకపోలేదని పలువురు టిడిపి శ్రేణులు భావిస్తున్నారు. మరోవైపు సంధ్యారాణికి పార్టీ అధినాయకత్వంతో ఉన్న సత్సంబంధాలు కూడా మంత్రి పదవి కోసం కలిసివచ్చే ఆస్కారం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



జయకృష్ణకు మంత్రి పదవి?

ప్రజాశక్తి - పాలకొండ



పాలకొండ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు ఈసారి మంత్రి పదవి వరిస్తుందని నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలుగా గెలిచారు. వీరంతా కొత్తవారే కావడం, అందులో ముగ్గురు ఎస్టీ నియోజకవర్గాల నుంచి గెలుపొందగా, ఒకరు ఎస్సీ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. అయితే ఎస్టీ కోటాలో సాలూరు ఎమ్మెల్యే గుమ్మడి సంధ్యారాణికి పదవి వరిస్తుందని, ఆమె గతంలో టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యురాలిగా పనిచేయడంతో ఆమెకు సనుకూలంశం అని అంటుండగా, అయితే ఆమె ఎస్టీ కాదనే వివాదం కూడా కొంతకాలం నుంచి తెరపై ఉంది. అదే విధంగా ఆమె కాంగ్రెస్ నుండి తెలుగుదేశం పార్టీలో చేరడంతో ఈమెకు మంత్రి పదవికి కొంత ఆటంకంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జనసేనకు ఎస్టీ కోటాలో మంత్రి పదవి వరిస్తుందని ఇక్కడ ప్రజలు అనుకుంటున్నారు. యువకుడు, ఉన్నత విద్యావంతుడు కావడంతో పాటు ఇటు టీడీపీతో కూడా సత్సంబంధాలు ఉండడం జయకృష్ణకు కలిసి వస్తుందని పలువురు చర్చించుకుంటున్నారు. జనసేన ఉత్తరాంధ్ర నాయకులు దానేటి శ్రీధర్ మద్దతు కూడా జయకృష్ణకు ఉందని తెలుస్తుంది. అదే విధంగా ఈయనకు రాజకీయ కుటుంబ నేపథ్యం ఉండటం, అలాగే తెలుగుదేశం పార్టీతోనే మొదటి నుండి ఆ కుటుంబం కొనసాగడంతో జయకృష్ణకు కలిసొచ్చినట్లుగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత ప్రభుత్వ హయంలో ఎమ్మెల్యే ఇక్కడ ఉన్నప్పటికీ ఇక్కడ ఉన్న మరో కీలకనేతకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టి విప్‌గా నియమించి సహాయ మంత్రి హోదా కట్టబెట్టారు. అయితే వైసిపిని నిలువరించి జనసేన జెండా ఎగురవేయడంలో సఫలీకృతమైన జయకృష్ణకు మంత్రి పదవి వరిస్తుందని ఆయన వర్గీయులు భావిస్తున్నారు. నియోజకవర్గం ఆవిర్భావం నుండి ఈ ప్రాంతంలో మంత్రిగా ఎవరూ పనిచేయలేదు. దీంతో డివిజన్ కేంద్రమైన పాలకొండలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంది. ఏది ఏమైనా మరికొద్ది రోజుల్లో ఈ విషయంపై స్పష్టత రానుంది. సమీకరణాలు అన్నీ కలిసొచ్చి జయకృష్ణ మంత్రి అయితే 1952లో పాలకొండ నియోజకవర్గ ఆవిర్భావం తర్వాత మంత్రి పదవి అధిరోహించిన మొట్టమొదటి వ్యక్తిగా జయకృష్ణ నిలవనున్నారు. ఆయనకు మంత్రి పదవి రావాలని, దీంతో పాలకొండ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రాలో బోల్తా పడిన ఒడిశా ఆటో

ఒకరి మృతి : పలువురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -కొమరాడ

ఒడిశాకు చెందిన ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురికి తీవ్ర గాయలైనట్లు స్థానికులు తెలిపారు. మన్యం జిల్లా కొమరాడ మండలం మారుమూల గిరిజన కుజ్జబడి -జల గ్రామాల మధ్య కొండపై ఈ ప్రమాదం సోమవారం ఉదయం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో కొరాపుట్ జిల్లా జిల్లా బందుగాం బ్లాక్ అలమండ పంచాయతీ కవిటి గ్రామానికి చెందిన కద్రక చింతలమ్మ (20)కు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో ఆమె సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. మిగిలిన ప్రయాణికుల కాళ్లు, చేతులు విరిగిపోవడంతో వీరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కొమరాడ మండలం పెద్ద శాఖ పంచాయతీ గుజ్జబడికి ఒరిస్సా రాష్ట్రం కేటా గ్రామం నుంచి పెళ్లికి ఆదివారం వెళ్లారు. తెల్లవారిన పెళ్లి అయిపోయిన తర్వాత ఆటోతో తమ స్వగ్రామానికి తిరిగి వెళ్తున్న సమయంలో కుజ్జబడి -జల గ్రామాల మధ్య కొండపై ఉన్న రహదారిపై ఆటో అదుపుతప్పి బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న కొమరాడ ఎస్సై నీలకంఠం స్పందించి అక్కడికి చేరుకున్నారు. తక్షణమే అందుబాటులో ఉన్న అంబులెన్సుల ద్వారా క్షతగాత్రులను పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆటో డ్రైవర్ పీడక ప్రసాదు, మరో ప్రయాణికులు కె.సీమ, పీడిక లచ్చి, పీడిక బాలమ్మ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే పీడిక పోలమ్మ ఎడమ చేయిరిగిపోయింది. పీడక కూర్మి కడుపు నొప్పితో బాధపడుతుంది. పీడిక జియా ఎడమ చేయి విరిగిపోయింది. కద్రక తులసమ్మ, పీడిక సంగీత, సన్యాసమ్మ ముఖాలపై తీవ్ర గాయాలయ్యాయి. మొత్తం 16 మందికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇలాంటి ప్రమాదం జరగడం ఇది రెండోసారి కావడంతో ప్రజలు ఒక్కసారి ఉలిక్కిపడింది. గతంలో కొండ నుంచి కిందకు దిగుతున్న ఘటనలో కమాండర్ ట్రాక్టర్ బోల్తా పడి పలు మృతి చెందిగా, పలువురు గాయలైన ఘటన రెండేళ్ల క్రితం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనలో గాయపడ్డ మహిళలు



బోల్తాపడిన ఆటో

బాధితులకు రెండు ప్రభుత్వాలు పరిహారం చెల్లించాలి : సిపిఎం

ఆటో ప్రమాదంలో మరణించిన కుటుంబ సభ్యులతో పాటు గాయలైన కుటుంబ సభ్యులకు ఆంధ్రా, ఒడిస్సా ప్రభుత్వాలు పరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం మన్యం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఆటో ప్రమాదానికి గురై మరణించిన చిన్న తల్లి, గాయాలపాలైన గిరిజనులను పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. బాధితులంతా ఒడిశాకు చెందిన పేద గిరిజనులేనని, ఇలా జరగడం చాలా బాధాకరమన్నారు. చనిపోయిన చినతల్లి కుటుంబానికి రూ.30 లక్షలు, క్షతగాత్రులకు రూ.5లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లించి ఆదుకోవాలని కోరారు. అలాగే క్షతగ్రాతులకు సత్వర చర్యలు అందించిన 108 సిబ్బందిని అభినందించారు.

క్షతగాత్రులను టిడిపి పరామర్శ

ఆటో ప్రమాదంలో గాయపడిన బాధితులను మండల టిడిపి కన్వీనర్ ఉదయ శేఖర్ పాత్రుడు జిల్లా కేంద్రాసుపత్రికి వెళ్లి పరామర్శించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించి త్వరగా కోలుకునేలా వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు.



రామోహ్మాన్‌నాయుడు అభినందిస్తున్న సిఎల్ నాయుడు దంపతులు

కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు సిఎల్ నాయుడు అభినందనలు

ప్రజాశక్తి -పాలకొండ

కేంద్రమంత్రి, శ్రీకాకుళం ఎంపి కింజరాపు రామ్మోహన్నాయుడును ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ మాజీ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సిఎల్ నాయుడు, పాలకొండ మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్, టిడిపి మహిళా నేత చొంగ రమాదేవి అభినందించారు. సోమవారం రామ్మోహన్ నాయుడును ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పిన్నవయసులో కేంద్రమంత్రి అయ్యారని, జిల్లా ఖ్యాతిని, రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింప చేశారని సిఎల్ నాయుడు దంపతులు అభినందించారు. మాజీ కేంద్రమంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు ప్రతిష్టాత్మక హిందీ ప్రచార సభ హైదరాబాద్ గౌరవాధ్యక్షులుగా ఉంటూ తెలుగు రాష్ట్రాల్లో హిందీ భాషాభివృద్ధికి తోడ్పాటు అందించారని నాయుడు దంపతులు పేర్కొన్నారు. అనంతరం రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రమంత్రిగా తన వంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లడమే తన ధ్యేయమని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

పలు చోట్ల పారిశుధ్య కార్యక్రమాలు

ప్రజాశక్తి - పాలకొండ, సీతంపేట, జియ్యమ్మవలస

జిల్లాలో ప్రజారోగ్య ఆవశ్యకత దృష్ట్యా పలు పారిశుధ్య కార్యక్రమాలు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. గ్రామ పంచాయతీ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, జిల్లా మలేరియా అధికారి సమన్వయంతో పనిచేస్తూ సంబంధిత సిబ్బంది క్షేత్ర స్థాయిలో పలు కార్యక్రమాలు చేపట్టడం కాకుండా ప్రజల్లో అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రభలకుండా ఉండేందుకు దోమల నివారణ ఆవశ్యమని, అందుకు ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా ప్రతి ఇంటిలో చర్యలు చేపట్టాలని కోరారు. ఇందులో భాగంగా పాలకొండ మండలం టాంపటపల్లి, గోపాలపురం పంచాయతీల్లో పూడికలు, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగింపు, బావులు, కీటకాల నాశనానికి బ్లీచింగ్ చల్లడం, తుప్పలు తొలగింపు, బహిరంగ మలవిసర్జన, కొళాయిలు, బోరుల వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా వివిధ పనులు చేపట్టారు. తాగు నీటి సరఫరా పైపుల పరిస్థితి తనిఖీ చేశారు. అలాగే దోమలు వ్యాప్తిని అరికట్టేందుకు లార్వా నిరోధక రసాయనాలను పిచికారి చేయించారు. మలేరియా దోమల వ్యాప్తి నివారణకు స్ప్రేయింగ్, తాగు నీరు కలుషితం కాకుండా వివిధ కార్యక్రమాలు చేపేట్టేరు. అలాగే సీతంపేట మండలం మనపురం, టిటుకుపై పుబ్బడ గ్రామ పంచాయతీల్లో పూడికలు, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగింపు, బావులు, బ్లీచింగ్ వేయడం, తుప్పలు తొలగింపు, కుళాయిలు, తాగు నీరు కలుషితం కాకుండా శ్రద్ధ వహించడం, బోర్లు వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా వివిధ పనులు చేపట్టారు. మలేరియా దోమల వ్యాప్తి నివారణకు స్ప్రేయింగ్ కార్యక్రమాలను మరింత వేగవంతం చేశారు. జియ్యమ్మవలస మండలంలోని చింతలబెళగాంలో కాలువల్లోని పూడికలు తొలగించడం, మురుగు నీరు నిల్వ ఉండకుండా వివిధ పనులు చేపట్టారు. అలాగే తాడూరు పంచాయతీలో పారిశుధ్య డ్రైవ్‌లో భాగంగా ఇళ్లలో పరిధిలో వివిధ కార్యక్రమాలు నిర్వహించి , అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పిహెచ్‌సిల వైద్యాధికారులు, సిబ్బంది, పంచాయతీ, మండల పరిషత్, మలేరియా సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.


కోట దుర్గమ్మకు పూజలు చేస్తున్న జిల్లా జడ్జి రజని

కోటదుర్గమ్మను దర్శించుకున్న జిల్లా జడ్జి

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో గల కోటదుర్గమ్మ వారిని సోమవారం విజయనగరం జిల్లా జడ్జి రజని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి మురళీకృష్ణ ఆమెకు సాదరంగా ఆహ్వానం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ ప్రత్యేక పూజలు చేయించారు.


మందుల షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

ఎరువులు, పురుగుల మందుల షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని ఎరువులు, పురుగుల మందుల షాపుల్లో డీలర్లు ఎవరైనా అధిక ధరలకు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని వీరఘట్టం మండల వ్యవసాయ అధికారి సౌజన్య డీలర్లను హెచ్చరించారు. ఆమె ఆధ్వర్యంలో సాలూరు మండలంలో గల విత్తనాల షాపుల్లో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి డీలరు విత్తనాలను, ఎరువులను ప్రభుత్వం ప్రకటించిన ధరలకే అమ్మకాలు చేయాలని, విధిగా రైతులకు విత్తనాలతో పాటు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాల్సిందిగా సూచించారు. రైతులకు నచ్చిన, వారు అడిగిన విత్తనాలను అందించాలని, నాసిరకం పత్తి విత్తనాలను, గడ్డి పత్తి విత్తనాలను అమ్మకూడదని, అమ్మినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాల రికార్డులను షాప్‌లో సరుకును సరిపోవాలని, హెచ్చు తగ్గులుంటే చర్యలు ఉంటాయని తెలిపారు. ఈతనిఖీల్లో సాలూరు ఎఒ అనురాధా పండా, ఎఇఒ శ్రీను పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ నాయకులు మోహనరావు

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

- ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో దేశ ప్రజలు కాంగ్రెస్‌కు అపూర్వ ఆదరణ చూపించారని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని ఈ ఎన్నికలు నిరూపించాయని పార్వతీపురం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు బత్తిని మోహన్‌రావు అన్నారు. నియోజకవర్గం కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో సహకరించిన నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ తరపున పేరుపేరునా అభినందనలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్ పేదలకు అండగా ఉంటుందని అన్నారు. ప్రజా సమస్యల పట్ల కాంగ్రెస్ ఎప్పుడూ పోరాడుతుందన్నారు. రాబోవు రోజుల్లో రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుస్తూ పిసిసి అధ్యక్షులు షర్మిల రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ ముందుకు సాగుతామని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు చొక్కాపు వెంకటరమణ, శిల్ల గౌరీ శంకర్, జమ్మన ప్రవీణ్ కుమార్, పట్ల సింగు రవికుమార్, బొమ్మాళి మోహన్‌రావు, మీసాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భూదేవిపై నారా లోకేష్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - పాలకొండ

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను సోమవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిసి ఇక్కడ పరిస్థితులను వివరించారు. టిడిపి నియోజకవర్గ ఇన్-ఛార్జ్ భూదేవితో పాటు, అసమ్మతి నేతలు కూటమి అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేశారని లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇన్‌ఛార్జి భూదేవిని ఎన్నికల ముందు ప్రకటించడం కూటమి అభ్యర్థి గెలుపుపై కొంత ప్రభావం చూపిందని చెప్పినట్లు తెలిసింది. వారంతా వ్యతిరేకంగా పనిచేయడం వల్లే 13వేలకు ఓట్లు మెజారిటీ వచ్చిందని, లేదంటే భారీ మెజారిటీ వచ్చే అవకాశం ఉండేదని లోకేష్‌కు వివరించినట్లు సమాచారం. ప్రమాణ స్వీకారం తర్వాత పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడేది లేదని లోకేష్ చెప్పినట్లు తెలిసింది.

గర్భిణులకు వైద్య తనిఖీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారులు ప్రదీప్ పి.ఉమామహేశ్వరి 51 మంది గర్భిణులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తపోటు మధుమేహం, ఎత్తు బరువు తదితర రకాల తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం దూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులకు వీరఘట్టంకు చెందిన సత్యసాయి భక్తులు భోజన సదుపాయం కల్పించారు. ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ రేణుకా దేవి అమ్మవారి వార్షికోత్సవం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక షిరిడీ సాయి ద్వారకామాయి ఆలయ ప్రాంగణంలో వెలసి ఉన్న శ్రీ రేణుకా దేవి అమ్మవారి వార్షిక ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, గాయత్రి పంచ కుండముల హెూమం చేపట్టారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కురుపాం పంచాయితీ పరిధిలో భక్తులు భారీగా తరలివచ్చారు .

సిఎం ప్రమాణ స్వీకారానికి తరలి రావాలి

ప్రజాశక్తి - భామిని

ఈ నెల 12న టిడిపి అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా, పాలకొండ ఎమ్మెల్యేగా నిమ్మక జయకృష్ణ ప్రమాణ స్వీకారానికి మండలంలోని టిడిపి కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు తెలిపారు. మండలంలోని బిల్లుమడ జనసేన కార్యాలయంలో జనసేన మండలి అధ్యక్షులు రుంకు కిరణ్ అధ్యక్షతన జనసేన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 12న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ డిప్యూటీ సిఎం ప్రమాణ స్వీకారానికి జనసేన కార్యకర్తలు రావాలని కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో దిమ్మిడిజోల సర్పంచ్ వలురౌతు రామారావు, మణిగ సర్పంచ్ కె. చంటి, రవీంద్ర, వైకుంఠ, అనిల్, నాగరాజు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌పై సమీక్ష

ప్రజాశక్తి - గరుగుబిల్లి

కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామపంచాయతీల్లో ఇటీవల చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌పై సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కె.సూర్యనారాయణ మాట్లాడుతూ పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఆయా గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అయితే ఆయా గ్రామపంచాయతీల్లో ప్రస్తుత సీజన్‌లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేలా పూర్తి స్థాయిలో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామపంచాయతీల పరిధిలో పలుచోట్ల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు తెలిపారు. సమావేశంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు తిరుపతి, భాస్కరరావు, సూరు శ్రీనివాసరావు, అడ్డూరి లలితకుమారి, పువ్వల శిరీష, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : గ్రామాల్లో సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు, మంచినీటి సౌకర్యం, ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు వచ్చే సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, పలువురు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.


సీతానగరం : కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఈశ్వరరావు

సీతంపేట : ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు, మలేరియా నివారణా చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఎంపిడిఒ కె.గీతాంజలి అన్నారు. పంచాయితీ కార్యదర్శులతో జరిఇన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీతంపేట మలేరియా అధికారి మోహన్‌రావు మాట్లాడుతూ పంచాయితీ కార్యదర్శులంతా గ్రామాల్లో మలేరియా వ్యాప్తి చెందకుండా, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు ఉదయం పంచాయతీ కార్యదర్శి ఆరోగ్య సిబ్బంది, వెలుగు సిబ్బంది గ్రామాల్లో ఫాగింగ్ స్ప్రేయింగ్, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎపిఎం విజయ కుమారి, తదితరులు పాల్గొన్నారు.


రావుపల్లిలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

రోడ్డుపై మురుగు నీరు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

కలెక్టర్ ఆదేశాల మేరకు మండలమంతా ఎక్కడ చూసినా పారిశుధ్య పనులు ఆగమేఘాల సిబ్బంది చేయిస్తున్నారు. ఈ పనులు మొక్కుబడిగానే చేస్తున్నాయన్న విషయం మండలంలో చేపడుతున్న పనులు చేస్తే తేటతెల్లమవుతుంది. మండలంలోని రావుపల్లిలో కాలువల్లో పూడికలు పేరుకుపోవడంతో మురుగు నీరు రోడ్డుపై పారుతుంది. అలాగే ఇక్కడి కాలనీ వాసులు వినియోగిస్తున్న బోరు కాలువలో పక్కనే ఉండడంతో ఈ మురికి నీరంతా బోరు వద్ద, రోడ్డుపై పారుతుంది. దీంతో దోమలు నిల్వ ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కాలువలో పూడిక తొలగించి మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చెప్పట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.


వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్యాధికారి సంతోష్‌కుమార్

హైరిస్క్ గర్భిణులను గుర్తించండి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గర్భిణుల్లో రక్త హీనత, హైరిస్క్ సమస్యలు తలెత్తకుండా వైద్య సిబ్బంది కృషి చేయాలని వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ పిహెచ్‌సిలో పిఎంఎస్ఎంఎ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అన్ని రక్త పరీక్షలు చేసి ప్రిజం- 10 గురించి అవగాహన కల్పించి, గర్భిణులకు అందజేస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మాతా, శిశు సంరక్షణ కార్డులో ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు పరిశీలించి నివేదికలు హెచ్చు, తగ్గులు గుర్తించి గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గర్భిణుల్లో జ్వర లక్షణాలు గుర్తిస్తే హైరిస్క్‌గా పరిగణించి సత్వరమే సమాచారమివ్వాలన్నారు. డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఎక్కువగా నీరు, ద్రవరూప ఆహారాన్ని తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. పిహెచ్‌సిలో సాధారణ ప్రసవాలు జరిగేలా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. రక్తహీనత, హైరిస్క్ సమస్యలకు గర్భిణీలు గురికాకుండా వైద్య, సిబ్బంది సూచనలు చేయాలన్నారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు ఉదయకుమారి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు. వైద్య సిబ్బంది ఉన్నారు..

అంతర్ రాష్ట్ర రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం నుండి కూనేరు వరకు వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కొమరాడలోని ఈశ్వరుని ఆలయం వద్ద రోడ్డుపై ఉన్న పెద్ద పెద్ద గోతుల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు, ప్రయాణికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గడిచిన రెండున్నరేళ్లుగా పాలకులకు, ఆర్అండ్‌బి అధికారులకు ఎంత చెప్పినా పట్టించుకోవడంలేదన్నారు. రోడ్డుపై ఉన్న గుమ్ములను వెంటనే కప్పాలని గతంలో నిరసన కార్యక్రమం చేసిన సందర్భంగా జూన్ 10లోగా గోతులు కప్పకపోతే నిరసన చేపట్టామన్నారు. అయితే ఇప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వారి మొండి వైఖరికి వ్యతిరేకంగా నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. గోతులు ఇంకుడు గుమ్ములుగా మారి వర్షం పడితే నీరు ఎక్కువగా చేరుకోవడం వల్ల అటు మూడు రాష్ట్రాలకు వెళ్లే వాహనదారులు ప్రయాణికులు ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగి అనేకమంది చనిపోవడంతో పాటు, పలువురు క్షతగాత్రులయ్యారని అన్నారు.


గోతుల వద్ద నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు, సిపిఎం నాయకులు

ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి గోతులను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే ఈనెల 20న అంతరాష్ట్ర రహదారి వద్ద రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గౌరినాయుడు, శివున్నాయుడు, పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట


శిక్షణలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో దిగువ కాలువరాయిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ ఎ.చిరంజీవిరావు, పి.నాగేశ్వరరావు ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత వివరిస్తూ నారుమడి తయారీ విధానం, వేసవి దుక్కులు గురించి వివరించారు. అలాగే భూమిలో పోషకాలు నత్రజని పెంపొందించడానికి పచ్చిరొట్ట విత్తనాలు, నవధాన్యాల ఉపయోగాలను తెలిపారు. బీజామృతంతో విత్తన శుద్ధి, నారుశుద్ధి వరి దిగుబడి కోసం లైన్ షోయింగ్ శ్రీవరి, జమున మోడల్ కోసం వివరించారు. చిరుధాన్యాలైన కొర్రలు, రాగులు, చామలు, గంటెలు, జొన్నల ఉపయోగాలు, అలాగే దీనికి చిరుధాన్యాలు విస్తీర్ణం పెంపొందించాలని రైతులకు వివరించారు. రసాయినిక ఎరువులు బదులుగా ప్రకృతి వ్యవసాయం ద్వారా ఘనజీవామృతం, ద్రవజీవామృతం ఉపయోగించాలన్నారు. పురుగు మందులు బదులుగా కషాయాలు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిస్త్రం, పంచపత్రిక కసాయం తయారు చేసి వాటిని ఉపయోగించాలని తెలిపారు. చీడపురుగులు తెగులు నివారణకు పక్షిస్తావరాలు, అలాగే రక్షక పంట్ల కంది, ఆముదం, బంతి గట్టు చుట్టూ వేయాలని రైతులకు తెలిపారు. గ్రామస్తులు, ప్రకతి వ్యవసాయం చేసేందుకు ముందుకు వచ్చినందున వెలుగు అసోసియేషన్ నుంచి సోలార్ ఎనర్జీ కార్డు రూ.3లక్షల విలువ గల వస్తువులను ఇచ్చారు. దీన్ని డెమో చేసి చూపించారు. ఈ శిక్షణలో పిఎండిఎస్ గులిరాగి జమున పద్ధతి వేసేందుకు ప్లాన్ చేశారు. ఈ శిక్షణలో దిగువ కలవరాయి, కారిగూడ, నడిమిగూడ నుండి రైతులు పాల్గొన్నారు. వెలుగు అసోసియేషన్ కార్యకర్త బి.జగ్గయ్య, మొబలైజర్ బె.రవికుమార్ పాల్గొన్నారు.


అరకొరగా తొలగిస్తున్న పూడికలు

పూడికతీతలు సరే... పర్యవేక్షణ ఏదీ?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని అన్ని వార్డుల్లో గల కాలువల్లో పూడికలు తీసేందుకు మున్సిపల్ సాధారణ నిధుల నుండి రూ.5 లక్షలు వెచ్చించి గత ఐదు రోజులుగా సంబంధిత కాంట్రాక్టర్ ప్రైవేటు సిబ్బందిచే పూడికలను తొలగిస్తున్నారు. అయితే పలు వార్డుల్లో పూడికలు తీస్తున్నప్పుడు ఆ వార్డుకు సంబంధించి సంబంధిత సచివాలయ శానిటరీ సెక్రటరీలు గానీ, ఇమ్యూనిటీ సెక్రటరీలు గానీ కనీస పర్యవేక్షణ చేయాల్సి అవసరం ఎంతైనా ఉంది. అయితే సోమవారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ వీధిలో సిబ్బంది పూడికలు తొలగిస్తున్న సమయంలో పర్యవేక్షణ చేయాల్సిన సచివాలయ ఉద్యోగులు లేకపోవడంతో కాలువల్లో పూడికలను పూర్తిస్థాయిలో తీయడం లేదని, పూడికలను తొలగించేటప్పుడు సంబంధిత వార్డు కౌన్సిలర్ కూడా పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ ప్రజారోగ్య విభాగం అధికారులు దృష్టి పెట్టి కాలువల్లో పేరుకుపోయిన పూడికలను పూర్తిస్థాయిలో తొలగించేలా పర్యవేక్షణ చేసేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


కేక్ కట్ చేస్తున్న బాలకృష్ణ అభిమానులు

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సినీ నటుడు, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ఛైర్మన్, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 64వ జన్మదిన వేడుకలు సోమవారం పట్టణంలోని నందమూరి బాలకృష్ణ సేవా సంఘం సీనియర్, జూనియర్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా టిడిపి సీనియర్ నాయకులు బార్నాల సీతారాం, 8వ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అభిమానులు బాణాసంచాను వెలిగిస్తూ జై బాలయ్య అంటూ బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. అనంతరం పేదలకు భోజన పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ నటనలో, సేవారంగంలో, రాజకీయ రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగిన బాలకృష్ణ ఆయా రంగాల్లో ఆదర్శంగా నిలిచి తన తండ్రి ఎన్టీఆర్‌కు తగ్గ తనయుడిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో పట్టణ నందమూరి సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎడ్ల శ్రీనివాసరావు, శెట్టి నారాయణరావు, చిన్న, రంజిత్, గంగ, గౌరవ అధ్యక్షులు మజ్జి కృష్ణారావు, పాకల సన్యాసిరావు, సిహెచ్ వెంకటరమణ, ముట్నూరు వెంకటరమణ, సుంకరి శ్రీనివాసరావు, పత్తిగిల్లి సత్తి, కోలామధు, వారణాసి నాగరాజు, తదితర అభిమాన పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో సీట్లు పెంచాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గిరిజన గురుకుల కళాశాలల్లో సీట్లు పెంచాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గిరిజన విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి స్థానిక ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన గురుకుల కళాశాలల్లో అవసరమైనన్ని సీట్లు పెంచాలని కోరారు. సీట్లు రాక అనేక మంది పేద గిరిజన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే ఐటిడిఎ పరిధిలో సిఆర్‌టిల రెగ్యులరైజేషన్ ప్రక్రియ కోసం డబ్బులు వసూళ్లు చేశారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని వినతిపత్రం అందజేశామని రంజిత్ కుమార్ తెలిపారు. బాలికల పాఠశాలల్లో పురుష ఉపాధ్యాయులను నియమించిన డిడి, సూపరింటెండెంట్లపై చర్యలు తీసుకోవాలని రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు.

ఓడినా, గెలిచినా ప్రజలతోనే : అలజంగి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

గెలుపోటములు రాజకీయ నాయకులకు, ప్రజాప్రతినిధులకు సహజమని, గెలిచినా, ఓడినా ప్రజలతోనే తన ప్రయాణమని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు, ఇన్‌ఛార్జులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లపాటు ప్రజలకు శక్తివంచన లేకుండా శ్రమించి సేవలందించానన్నారు. అయితే ప్రజల తీర్పు భిన్నంగా వచ్చిందని, దాన్ని గౌరవించడం మన విధి అని అన్నారు. అధికార పక్షానికి కొంతకాలం గడువు ఇచ్చాక వారు ప్రజలకు వ్యతిరేకంగా పనిచేస్తే తప్పకుండా వారిని నిలదీస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరేశ్వరి, వైస్ ఎంపిపిలు కొండపల్లి రుక్మిణి, ఇండుపూరు గుణ్ణేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జెసిఎస్ కన్వీనర్ గొర్లీ మాధవ్ రావు, సీనియర్ నాయకులు, వార్డుల కౌన్సిలర్ సభ్యులు, వార్డుల ఇంచార్జీలు, కార్యకర్తలు పాల్గొన్నారు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

నేరాలు ఘోరాలు

అనారోగ్య సమస్యలతో ఉపాధ్యాయుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్


మృతి చెందిన పాపారావు

మండలంలోని చిన్న బొండపల్లికి చెందిన ఉపాధ్యాయుడు అనారోగ్య సమస్యలతో మనస్థాపం చెంది గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం జరిగింది. గ్రామస్తుల వివరాలు మేరకు చిత్త పాపారావు (49) పెద్దబొండపల్లి పంచాయితీ దిబ్బగుడ్డివలస ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో తలెత్తిన ఆరోగ్య సమస్యల వల్ల మనస్థాపంతో ఈ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చెట్టుపై నుండి జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని నరసాపురం పంచాయతీ పరిధిలోని హెచ్.కారాడవలసకు చెందిన పులుగుమ్మి సింహాచలం (51) అనే మహిళ ఈనెల 4న గ్రామంలో ఉన్న మామిడి చెట్టు ఎక్కి కాయలు తెంపుతుండగా జారిపడి తీవ్ర గాయాలు పాలయ్యింది. ఆమెను జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించినట్లు రూరల్ ఎస్సై దినకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేటకు చెందిన బిడ్డిక లక్ష్మణరావు (72) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వివరాలకు వెళితే. లక్ష్మణరావు సీతంపేట సంత మార్కెట్ ఎదుట ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ వద్ద కరెంట్ బిల్ కట్టి తిరిగి ఇంటికివస్తున్నాడు. ఆయన్ను పాలకొండ నుండి సీతంపేట వైపు వస్తున్న బైకు ఢీకొనడంతో లక్ష్మణరావు తలకు బలమైన గాయమైంది. దీంతో ఆయన్ను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రి వద్దనే మరణించినట్లు లక్ష్మణరావు కుమార్తె పడాల ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీష్ నాయుడు తెలిపారు. లక్ష్మణరావు గతంలో ఐటిడిఎలో పని రిటైర్ అయ్యారు.

కాశీలో వడదెబ్బకు గురై వీరఘట్టం వాసి మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం


మృతి చెందిన సరోజని

మండల కేంద్రమైన వీరఘట్టంలోని బిసి కాలనీకి చెందిన లింగం సరోజని (54) వడదెబ్బకు గురై సోమవారం కాశీలో మృతి చెందారు. ఈ వీధిలోనే కొంతమందితో ఈనెల 5న తీర్థయాత్ర కోసం కాశీ వెళ్లారని, ఎండ తీవ్రత వల్ల వడదెబ్బకు గురై మృతి చెందినట్లు తోటి వారి నుండి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సరోజని కుమారుడు వెంకటరమణ హుటాహుటిన కాశీ బయలుదేరాడు. ఈమెకు కుమార్తె మౌనిక కూడా ఉంది.